క్లుప్తంగా

పులి కనిపిస్తే సమాచారం ఇవ్వాలి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎస్సై అంజయ్య

కెరమెరి: పెద్దపులి తారసపడితే పోలీసులకు లేదా అటవీ అధికారులకు సమాచారం ఇవ్వాలని ఇన్‌చార్జి ఎస్సై అంజయ్య అన్నారు. మంగళవారం మండలంలోని టోకెన్ మోవాడ్, బాబేఝరి గ్రామాలకు చెందిన ప్రజలతో మాట్లాడారు. జోడేఘాట్ పరిసర ప్రాంతాల్లో పులి సంచరిస్తుందని ఒంటరిగా బయటకు వెళ్లొద్దన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో దప్పు చాటింపు చేయించారు. ఆయన వెంట ఏఎస్సై బాల్‌సింగ్ ఉన్నారు.

కొనసాగుతున్న సమగ్ర సర్వే



లింగాపూర్: సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీవో

లింగాపూర్: సిర్పూర్(యూ) మండలంలోని ధనోర గ్రామపంచాయతీ పరిధిలోని సేవాదాస్‌నగర్, మహాగాంలలో జరుగుతున్న సమగ్ర సర్వేను మంగళవారం ఎంపీడీవో క్రిష్ణారావు పరిశీలించారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీలలో 35 మంది ఎన్యూమరేటర్లు సర్వే చేస్తున్నారు. కాగా మంగళవారం 3653 కుటుంబాల సర్వే పూర్తయినట్లు అధికారులు తెలిపారు.

కెరమెరిలో..

కెరమెరి: మండలంలోని వివిధ గ్రామాల్లో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతోంది. మంగళవారం 8232 కుటుంబాలకు సర్వే పూర్తి చేశారు. మంగళవారం ఒక్కరోజు 760 కుటుంబాల్లో సర్వే కొనసాగింది. ఉపాధ్యాయులు, గ్రామ కార్యదర్శులు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు. ఎంపీడీవో అంజద్‌పాషా, తహసీల్దార్ దత్తుప్రసాద్, మండల విద్యాధికారి ఆడే ప్రకాశ్, ఇతర సూపర్‌వైజర్లు పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో అంగారిక చతుర్థి



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని బ్రాహ్మణవాడ గణేశ్ మందిర్‌లో అంగారిక చతుర్థిని పురస్కరించుకొని మంగళవారం ఆలయంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఒజ్జల శిరీష్‌శర్మ, శ్రీనివాస్‌శర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి అష్టోత్తర శతనామావళి, అభిషేకం, పుష్పార్చన, గణపతి ఉపనిషత్తులు, మంగళహారతి, మహా మంత్రపుష్పం చేపట్టారు. రాత్రి 8.28 గంటల తర్వాత చంద్రోదయం అనంతరం భక్తులు ఉపవాస దీక్షలు వదిలి మొక్కులు తీర్చుకున్నారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పశువులకు కృత్రిమ గర్భధారణ

కెరమెరి: లింగనిర్ధారణతో కృత్రిమ గర్భధారణ చేస్తే ఆవుదూడలే జన్మిస్తాయని మండల పశువైద్యాధికారి సురేశ్ అన్నారు. మంగళవారం మండలంలోని కొలాంగుడి గ్రామంలో పశుగణాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భకోశ వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించారు. 33 ఎద్దులు, 22 దూడలకు నట్టల నివారణ మందు పంపిణీ చేశారు. డాక్టర్ రామారావు రాథోడ్, సుప్రియ, గోపాలమిత్ర సూపర్‌వైజర్లు రమేశ్ తదితరులు ఉన్నారు.

రాస్పెల్లిలో ఈజీఎస్ గ్రామసభ

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని రాస్పెల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం ఈజీఎస్ గ్రామసభను నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధిహామీ పథకంలో చేపట్టనున్న పనులపై చర్చించారు. ఈసందర్భంగా ఏపీవో బుచ్చన్న మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. టెక్నికల్ అసిస్టెంట్ కిశోర్, ఫీల్డ్ అసిస్టెంట్ కుందారపు వైకుంఠం, గ్రామకార్యదర్శి రమ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

దహెగాం: ప్రభుత్వం మంజూరు చేసిన కల్యాణలక్ష్మి చెక్కులను బుధవారం లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ కవిత మంగళవారం తెలిపారు. మండలంలో 76 మందికి చెక్కులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు హాజరవుతారన్నారు.

పత్తి రైతు పరేషాన్



ఇంట్లో నిల్వ ఉన్న పత్తి

- తగ్గిన పంట దిగుబడి
- ధర లేక దిగాలు
- దళారులకు అమ్మి నష్టపోతున్న రైతులు

బెజ్జూర్: ఏటా పత్తి రైతు ఏదో ఒక రకంగా చిత్తవుతున్నాడు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయానికి సరైన ధర లేకపోవడం, అకాల వర్షాలు కురుస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నాడు. వేల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేస్తే ప్రతికూల వాతావరణంలో అంతంత మాత్రమే దిగుబడి వస్తోంది. వచ్చిన కొద్దిపాటి పంటను అమ్ముకునేందుకు మద్దతు ధర లేకపోవడంతో దిగాలు చెందుతున్నాడు. నియోజకవర్గంలో కౌటాల, సిర్పూర్‌లలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా రైతులకు సరైన అవగాహన లేక దళారులకు తక్కువ ధరకు అమ్మి నష్టపోతున్నారు. ప్రభుత్వం క్వింటాలు పత్తికి రూ.7,521 మద్దతు ధరను ప్రకటించగా.. దళారులు క్వింటాలు పత్తిని రూ.6400 నుంచి రూ.6500 ధరతో కొనుగోలు చేస్తున్నారు.

అనుకూలించని వాతావరణం..

సీజన్ మొదట్లో పత్తి విత్తనాలు వేసేందుకు అనువైన వర్షాలు పడలేదు. విత్తనాలు వేసినా వర్షాల్లేక రెండు, మూడుసార్లు విత్తనాలు వేయాల్సి వచ్చింది. పత్తి పూత దశకు వచ్చిన సమయంలోనూ భారీ వర్షాలు పడ్డాయి. పంట పొలాలు నీట మునిగి పూత, కాయ నేలవాలాయి. నీటిలో మునిగి తెగుళ్ల సోకి దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితుల్లో దిగుబడి ఆశించిన స్థాయిలో వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు ఈసారి విత్తనాలు, ఎరువుల ధరలు, ఖర్చులు భారీగా పెరిగాయని వాపోతున్నారు.

కూలీల భారం తడిసిమోపెడు..

పంట సాగు చేయడం ఒక వంతు అయితే దాని ఏరివేత రైతులకు ఇబ్బందికరంగా మారింది. పత్తి ఏరివేతకు సరిపడా కూలీలు దొరక్కపోవడంతో అవస్థలు పడుతున్నారు. పత్తి ఏరివేతకు కిలోకు రూ.10 నుంచి రూ.12లు కూలీ చెల్లిస్తున్నారు. రైతులు ఆయా గ్రామాలకు వెళ్లి కూలీలను ఆటోలు, ట్రాక్టర్లలో చేలకు తరలిస్తున్నారు. వాహనాల ఖర్చులతో పాటు కిలో పత్తికి రూ.12 వరకు చెల్లించాల్సి వస్తోందని, దీంతో ఆర్థికంగా అదనపు భారం పడుతుందని రైతులు

మోసపోతున్న రైతులు

నియోజకవర్గంలో రెండు సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కానీ కొనుగోళ్లలో జాప్యంతో పాటు రైతులకు సరైన అవగాహన లేక రైతులు దళారులకు పంటను విక్రయిస్తున్నారు. రైతులు ఇంట్లో పత్తి నిల్వ చేసుకోలేక తక్కువ ధరకు ప్రైవేట్ వ్యాపారులు, దళారులకు అమ్ముకుంటున్నారు. దీనిని ఆసరాగా చేసుకొని దళారులు నాసిరకంగా ఉందని సాకులు చెబుతూ అందినకాడికి దండుకుంటున్నారు. కాగా జిల్లాలో 3.36 లక్షల్లో పత్తి పంట సాగు చేశారు. వాతావరణ పరిస్థితుల కారణంగా ఎకరానికి 8 క్వింటాళ్ల దిగుబడి రావడం కూడా కష్టంగా ఉంది.

గిట్టుబాటు ధర కల్పించాలి



ప్రభుత్వం పత్తి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలి. ఈసారి పూత, కాత సమయంలో వర్షాలు లేకపోగా, పత్తి ఏరివేత సమయంలో కురిసిన వర్షాలతో పంట దెబ్బతింది. దీంతో దిగుబడిపై ప్రభావం పడింది. ఎకరానికి 8 క్వింటాళ్ల దిగుబడి కూడా రావడం లేదు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో మద్దతు ధర కల్పించి అన్నదాతలను ఆదుకోవాలి.

– కొట్రంగి లింగయ్య, రైతు, సిద్దాపూర్

ఘనంగా ఇందిరాగాంధీ జయంతి



వాంకిడి: నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



తిర్యాణి: ఇందిరాగాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



రెబ్బెన: నివాళులర్పిస్తున్న నాయకులు

వాంకిడి: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ ఆధ్వర్యంలో దేశ తొలి మహిళా ప్రధాని ఇందిరా గాంధీ 107వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ వాంకిడి అధ్యక్షుడు మండోకర్ అనిల్, మండల యూత్ అధ్యక్షుడు దుర్గం ప్రశాంత్, నాయకులు కిషన్, జబోరె గణేశ్, బొట్టుపల్లి జైరాం, జమ్మల్‌పూరి సుధాకర్, మల్లయ్య, ధర్మ, తదితరులు పాల్గొన్నారు.

తిర్యాణిలో..

తిర్యాణి: ఇందిరా గాంధీ ఆశయాలు స్ఫూర్తిదాయకమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిత్తారి సాగర్ అన్నారు. మంగళవారం ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు పున్నం హరీశ్‌కుమార్, పరుశురాం గౌడ్, శ్రావణ్ తదితరులు ఉన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద మంగళవారం దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పండ్లు పంపిణీ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దేవాజీ, మాజీ జెడ్పీటీసీ ప్రకాశ్ రావు, నాయకులు సుదర్శన్‌గౌడ్, మురళీ, మధునయ్య, గంటుమేర, చిరంజీవిగౌడ్, కిషన్‌గౌడ్, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్‌గౌడ్, గోగర్ల రాజేశ్, సురేందర్‌రాజు, రవీందర్ పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కౌటాల: క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. కాగజ్‌నగర్‌లో నిర్వహించిన నేషనల్ లెవల్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో ముత్తంపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు సంధ్యా, నందిని ప్రతిభ కనబర్చడంతో వారిని మంగళవారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో ముందుండాలని తెలిపారు. బాలికలు తమ ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ అంజన్న, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఎస్సైలకు సన్మానం



లింగాపూర్: ఎస్సైని సన్మానిస్తున్న తహసీల్దార్



బెజ్జూర్: ఎస్సై విక్రమ్‌ను సన్మానిస్తున్న నాయకులు

లింగాపూర్: లింగాపూర్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించి బదిలీపై బెజ్జూర్‌కు వెళ్తున్న ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ను మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు ఘనంగా సన్మానించారు. తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్, ఆర్ఐ ప్రదీప్, సంజు పాల్గొన్నారు.

బెజ్జూర్‌లో..

బెజ్జూర్: బెజ్జూర్ ఎస్సైగా పనిచేసి బదిలీపై వెళ్తున్న విక్రమ్‌ను మండల కుల సంఘాల నాయకులు ఘనంగా సన్మానించారు. మంగళవారం పోలీసుస్టేషన్‌లో శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. బెజ్జూర్‌లో చేసిన సేవలు అభినందనీయమని కొనియాడారు. ఆయా సంఘాల, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై ఆటోడ్రైవర్లకు అవగాహన

కాగజ్‌నగర్‌రూరల్: ట్రాఫిక్ నిబంధనలపై పట్టణంలోని ఆటోడ్రైవర్లకు పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు లైసెన్సు కలిగి ఉండాలని, మద్యం తాగి ఆటో నడపరాదని, మహిళా ప్రయాణికులకు, వయోవృద్ధుల పట్ల గౌరవంగా ప్రవర్తించాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం బస్టాండ్ ఎదురుగా ఎలాంటి అనుమతులు లేకుండా నడిపిస్తున్న పండ్ల దుకాణాలను తొలగించాలని ఆటో యూనియన్ సభ్యులు సీఐకి వినతిపత్రం అందజేశారు. త్వరలోనే చర్యలు తీసుకుంటామని సీఐ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్సై దీకొండ రమేశ్, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

'పోరాట ఫలితమే చట్ట సవరణ'

కాగజ్‌నగర్‌రూరల్: వయోధికుల పోషణ, సంరక్షణ చట్టానికి సవరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసిందని సీనియర్ సిటిజన్ సంఘం రాష్ట్ర కార్యదర్శి మార్త సత్యనారాయణ తెలిపారు. పోస్టుకార్డుల ఉద్యమంలో భాగంగా నాలుగు లక్షల మంది ఉత్తరాలు పంపి సంచలనం సృష్టించిన ఫలితంగానే కేంద్ర ప్రభుత్వం గ్రహించి సుముఖత తెలిపినట్లు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారితశాఖ కార్యదర్శి అమిత్ యాదవ్ వెల్లడించారని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వానికి, సీనియర్ సిటిజన్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారావ వయోధికులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఫ్లైఓవర్ పైనుంచి పడి యువకుడికి గాయాలు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని గుండి రహదారి వెళ్లే మార్గంలోని ఫోర్‌లైన్ ఫ్లెటైవర్ పై నుంచి ప్రమాదవశాత్తు పడిపోయిన యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని రాజంపేటకు చెందిన యువరాజు తన స్నేహితులతో కలిసి మంగళవారం రాత్రి ఫోర్‌లైన్ ఫ్లెటైవర్‌పై జన్మదిన సంబరాలు జరుపుకున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు ఫ్లెవైర్‌పై నుంచి కింద పడిపోవడంతో తలకు, శరీరానికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108కు సమాచారం ఇవ్వడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి, ప్రాథమిక చికిత్స అనంతరం మంచిర్యాలకు తరలించారు. సీఐ రాజు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీసీఐలో పత్తి విక్రయించాలి

కౌటాల: రైతులు సీసీఐలో పత్తి పంటను విక్రయించాలని కౌటాల మండల వ్యవసాయాధికారి పెందోర్ ప్రేమలత అన్నారు. మంగళవారం కౌటాల రైతు వేదికలో రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేతలు రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. వరి, పత్తి పంటల కోత అనంతరం వరి, పత్తి కొయ్యలు కాల్చకుండా భూమిలోనే కలియ దున్నాలని తెలిపారు. రైతులు వరి ధాన్యం వరి కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలన్నారు. ప్రభుత్వం సన్న రకం వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ. 500 బోనస్ ఇస్తుందని తెలిపారు. ఏఈవోలు అంజన్న, ఘనశ్యాం, రేష్మిత, కవిత, ఆదిత్య, సిదార్థ తదితరులు పాల్గొన్నారు.

'సీబీఎస్ఈ' అమలుకు కృషి చేయాలి

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నత పాఠశాలలో సీబీఎస్ఈ సిలబస్ అమలుకు కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు దుర్గం రవీందర్, పూదరిసాయిలు కోరారు. మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవితేజను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ గోలేటిలోని గనుల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పిల్లలతో పాటు పరిసర ప్రాంత ప్రజల పిల్లలకు సింగరేణి పాఠశాల ద్వారా నాణ్యమైన విద్యను అందిస్తున్నారన్నారు. నాయకులు పర్వతి సాయి, బాలు నాయక్‌లు పాల్గొన్నారు.

దశాబ్ది ఉత్సవాలతో ఐక్యత చాటాలి

ఆసిఫాబాద్‌అర్బన్: ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న నిర్వహించే దశాబ్ది ఉత్సవాలతో ఐక్యత చాటాలని ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు సెర్ల మురళీధర్ అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం సదస్సు నిర్వహించిన అనంతరం నాయకులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సతీశ్, రాజేష్, రవి, నరేశ్, సతీశ్, మురళీ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'రైతులను మోసం చేస్తే ఊరుకోం'

జైనూర్: రైతులు పంటలను మార్కెట్ కమిటీ, సీసీఐల్లోనే విక్రయించాలని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడ్మేత విశ్వనాథ్ అన్నారు. మంగళవారం మండలంలోని జామిని గ్రామంలో రైతులతో మాట్లాడారు. వ్యాపారులు మద్దతు ధరకంటే తక్కువ ధరలకు పంటలను విక్రయిస్తే చర్యలు చేపడుతామన్నారు. అనంతరం జామిని గ్రామంలో క్రీడల్లో ప్రతిభ కనబరిచిన ముండే అంకితను ఘనంగా సన్మానించారు. గ్రామ పటేల్ మడావి కోద్దు, హెచ్ఆర్‌సీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముండే సతీశ్, నాయకులు కేంద్రే పర్శరాం, అర్కు పర్శరాం, మడావి గోవింద్‌రావు, మెస్రం బాదిరావు, అర్క మాధవ్‌రావు తదితరులు ఉన్నారు.

చిన్నబోయిన 'చిన్నుగూడ'



చిన్నుగూడ గ్రామం



చిన్నుగూడకు వెళ్లే మట్టి రోడ్డు



తడకలతో ఉన్న ఇల్లు

- సమస్యలతో ఆదివాసీలు సతమతం
- ఏళ్లుగా పక్కా ఇళ్లకు నోచుకోని వైనం
- కన్పించని బీటీ రోడ్డు
- నిరుపయోగంగా మరుగుదొడ్లు

కెరమెరి: మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఆదిమ గిరిజనుల గ్రామం సమస్యలతో సతమతమవుతుంది. కెస్లాగూడ గ్రామ పంచాయతీ పరిధి చిన్నుగూడ గ్రామంలో కనీస సౌకర్యాలు గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో మొత్తం 18 కుటుంబాలు ఉండగా, 85 మంది జనాభా ఉన్నారు.

పక్కా ఇళ్లు లేవు..

ఎన్నో ప్రభుత్వాలు మారినా ఆదివాసీల తలరాత మారడం లేదు. 18 గృహాల్లో 5 గృహాలు మాత్రమే ఇటుక గోడలతో ఉన్నాయి. మిగిలిన గృహాలు కట్టె పుల్లలు, వెదురుతో నిర్మించారు. గ్రామంలోని ఏ ఒక్క ఇంటికి స్లాబ్ లేదంటే అతిశయోక్తి కాదు. కొన్ని ఇళ్లపై రేకులు ఉంటే.. మరికొన్నింటిపై గూన పెంకులు ఉన్నాయి. మరి కొన్ని ఇళ్లపై ప్లాస్టిక్ కవర్లతో కప్పు వేశారు. వర్షం పడ్డ ప్రతీసారి వారి అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

రోడ్డు సౌకర్యం కరువు..

మండల కేంద్రం నుంచి ఆ గ్రామానికి వెళ్లాలంటే కేవలం 3 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంటుంది. కానీ గ్రామానికి కచ్చారోడ్డే దిక్కుగా మారింది. వానాకాలంలో రోడ్డంతా బురదమయంగా మారుతుంది. కాగా గ్రామంలో ఒకటే చేతిపంపు ఉండగా, అది చెడిపోతే పక్కన ఉన్న మడవిగూడకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. మిషన్ భగీరథ నీరు అందుతున్నా మరమ్మతులకు గురైనప్పుడు వారికి నీటి ఇబ్బందులు తప్పడం లేదు. గ్రామంలో గతంలో మంజూరు చేసిన మరుగుదొడ్లు సైతం నిరుపయోగంగా మారాయి.

ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయాలి



మా గ్రామానికి ఇందిరమ్మ గృహాలు మంజూరు చేయాలి. కెరమెరికి వెళ్లే ప్రధాన రోడ్డు వానాకాలంలో బురదమయంగా మారుతుంది. బీటీ రోడ్డు వేయాలి. మరో చేతిపంపు ఏర్పాటు చేసి తాగు నీటికి ఇబ్బంది లేకుండా చూడాలి.

– సిడాం దేవ్‌రావు, చిన్నుగూడ

పాఠశాలల తనిఖీ



తనిఖీ చేస్తున్న ఎంఈవో శ్రీనివాస్

లింగాపూర్: మండలంలోని ఎల్లాపటార్, పిక్లా తండా పాఠశాలను మంగళవారం ఎంఈవో శ్రీనివాస్ తనిఖీ చేశారు. న్యాస్‌పై విద్యార్థులు ఏ విధంగా నేర్చుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు ప్రవీణ్, ఉత్తం తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం మండల కమిటీ ఎన్నిక



సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

రెబ్బెన: మండల కేంద్రంలోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం మండల ఆర్య వైశ్య సంఘం ఎన్నికలు నిర్వహించారు. జిల్లా ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు రాచకొండ నాగేశ్వర్ రావు అధ్యక్షతన నిర్వహించిన ఎన్నికల్లో మండల అధ్యక్షుడిగా చిలువేరు రమేశ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శిగా సిద్దంసెట్టి ప్రకాశ్, కోశాధికారిగా గోలి వెంకటేశ్‌లను ఎన్నుకున్నారు. యువజన సంఘం మండల అధ్యక్షుడిగా రాచర్ల రాకేశ్, ప్రధాన కార్యదర్శిగా పాత రాజు, కోశాధికారిగా గణపురం సాయికృష్ణ, వాసవి సేవాదళ్ అధ్యక్షుడిగా కోట నాగేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా కొలిపాక వంశీకృష్ణ, కోశాధికారిగా సిద్దంశెట్టి సుభాష్, మహిళా విభాగం అధ్యక్షురాలిగా పుల్లూరి విజయలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా మైలారపు అన్నపూర్ణ, కోశాధికారిగా ఉమాదేవీలను ఎన్నుకున్నారు. జిల్లా ఆర్యవైశ్య మహాసభ కోశాధికారి కొడిపాక సంతోష్, యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోనగిరి సందీప్, కోశాధికారి చిదురాల రాజశేఖర్, జిల్లా ఉపాధ్యక్షుడు అనంతల సురేశ్, జిల్లా గౌరవ అధ్యక్షుడు గుల్బం చక్రపాణి, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొలిపాక కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ మండలి కమిటీకి సన్మానం



సన్మానిస్తున్న డీఎం విశ్వనాథ్

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో కొత్తగా ఎన్నికైన ఉద్యోగుల సంక్షేమ మండలి అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, అశోక్‌లను డిపో మేనేజర్ విశ్వనాథ్ మంగళవారం శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డిపో అభివృద్ధికి, కార్మికుల సంక్షేమానికి సంక్షేమ మండలి పాటుపడాలని సూచించారు. సూపరింటెండెంట్ శ్రీనివాస్, ట్రాఫిక్ ఇన్‌చార్జి సరియ, మెకానికల్ ఇన్‌చార్జి ఉదయ్, అకౌంటెంట్ శామ్యూల్, హెడ్ కానిస్టేబల్ వెంకట్రాజం, పాత సభ్యులు శ్రావణ్ పాల్గొన్నారు.